स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत-उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

# కర్మణ్యే సంచరరే!

వేదాంతం శ్రీపతిశర్మ

కిట్టయ్య కారు నడుపుకుంటూనే జీవిత కాలం గడిపేశాడు. ఆ అంబాసిడర్ కార్లో ఎందరెందర్నో రకరకాల పనులకు తిప్పి తిరిగి ఇంటికెళ్ళే వేళకి కంపెనీలో పెట్టేసి ఒక్కోసారి చివరి బస్సు కూడా ఎక్కి ఇంటికి చేరుకుంటూ వుంటాడు. ఎవరు ఏ పనిమీద వెళుతున్నారనేది పట్టించుకునే వాడు కాదు. ఆ వెనుక సీట్లో వున్న వాళ్లు పెద్దగా మాట్లాడే వాళ్లు కాదు, కాకపోతే ఆ మధ్య కంపెనీ ఒక విభాగం నుండి ఇంకో విభాగానికి బదిలీ అయినప్పటి నుండీ రిటైర్ కాబోతున్న విజయ్ కుమార్ గారు ఆ కారులో కూర్చోవటం మొదలుపెట్టాడు. కంపెనీ కాంపౌండ్ దాటి రోడ్డు మీదకి వచ్చేవరకే ఏమీ మాట్లాడేవారు కారు. ఒక సిగ్నల్ దాటగానే ఏదో ఒకటి అడిగేవారు. ఏదో చెప్పేవారు. ఈయన అసలు ఈ రోజు రిటైర్ అయిపోయి వెళ్లిపోతున్నారంటే ఎందుకో బాధగానే ఉంది. ఈరోజు కంపెనీలో ఆయన చివరి రోజు. ఈ రోజు తరువాత ఈ కారుకి ఆయనతో ఏ పనీ వుండదు. సాయంత్రం వీడ్కోలు సభ కూడా అయిపోయింది. ఆయన పూలదండలన్నీ పక్కన పెట్టి కారెక్కాడు.



"కిట్టయ్యా!"

"సార్"

"నన్ను ఈరోజు ఇంటిదగ్గర కాదు, ఇదిగో ఈ అడ్రస్సుకు తీసికెళ్లి అక్కడ దింపెయ్. నేను అక్కడి నుండి నా దారిన నేను ఇంటికి వెళ్లిపోతాను"

ఆయన అందించిన చీటీ తీసుకున్నాడు కిట్టయ్య. గట్టిగానే చదివాడు.

"నూట పందొమ్మిది డాష్ ముప్ఫయి తొమ్మిది, నారాయణ పిళ్లై స్ట్రీట్, శివాజినగర్, కంటోన్

మెంట్, బెంగుళూరు! ఇదేంటి సార్? ఎప్పుడూ వెళ్ల లేదు!''

ఆయన తనదైన ధోరణిలో చెప్పారు.. ''నువ్వు నా సారథివి. కిట్టయ్యవి. నువ్వు నడపాలి. నేను నడవాలి!''

మారు మాట్లాడలేదు కిట్టయ్య. అతనికి అది అలవాటే! ఈ విధంగా మాట్లాడే వాళ్లని ఆ కంపెనీలో ఎప్పుడూ చూడలేదు. ఇప్పుడు అసలు సమస్య– ఈ చిరునామాకు ఎలా తీసుకుని వెళ్లాలి? కష్టమే. ఈ మహానగరంలో ఎన్నో ఇళ్లు పగలగొట్టి అపార్ట్‌మెంట్స్ కట్టేశారు.

''నేను సారథిని ఏంటి సార్? నా పేరు కిట్టయ్య అయినంత మాత్రాన ఎంత మాట అంటున్నారు సార్?''

''చక్రం తిప్పటం లేదు మరీ? నువ్వు దానిని తిప్పితేనే కదా మాలాంటి వాళ్లు తిరిగేది''

''చక్రం వేలిమీద పట్టుకోవటం లేదు కదా సార్?''

''కొంపదీసి అంత పని చెయ్యకు''

ఆయన నవ్వుతూనే అలా అనేస్తారు. కారు ఆ శబ్దాల మధ్య క్రికెట్ స్టేడియం దాటి మహాత్మా గాంధీ రోడ్డుమీద దూసుకు పోతోంది.

''కన్నడం వాళ్లకి అన్నీ సందేహాలే'' ఆయన అన్నారు.

''ఎందుకు సార్?''

''బారో, రెస్టారెంటో ఏదో ఒకటి అన్నట్లు వ్రాస్తారు''

''కరెక్ట్. అది వాళ్ల లిపి. ఇంతకీ ఈ అడ్రస్సుకు ఎందుకు సార్, చెప్పలేదు?''

''చూడు కిట్టయ్యా, ఏదైనా వెతికేటప్పుడు ఎందుకు అనే ఆలోచన రాకూడదు. నీ సర్వీసులో నువ్వు ఎన్నిసార్లు వెళ్లిన చోటుకే వెళ్లి, నాలుగైదు సార్లు తిరిగిన చోటుకే తిరిగి బాధపడ్డావో చెప్పగలవా?''

''లెక్కలేనన్ని సార్లు తిరిగాను సార్. కానీ ఏ రోజూ బాధపడలేదు''

''ఎందుకు?''

''ఇది నా పని సార్. ఇందులో బాధెందుకు?''

''బావుంది. అందుకే నువ్వు నా సారథివి''

''మళ్లీ మొదటికొచ్చారు సార్. నేనెక్కడ, మీరెక్కడ?''

''నీకు తెలుసో లేదో, కంపెనీకి సంబంధించినవి ఎన్నో నిర్ణయాలు నేను ఈ కార్లోనే, నీతో మాట్లాడుతూనే తీసుకుంటాను. విన్నావా?''

''ఈ కార్లోనా? నాకు ఎప్పుడూ చెప్పలేదే? అదెలా సార్?''

కమర్షియల్ స్ట్రీట్ వైపుకు వెళ్లే దగ్గర సిగ్నల్ దగ్గర ఆగింది కారు.

''ఇష్టమైన పనులు ఎవరైనా చేస్తారు. ఇష్టం లేనివి చెయ్యటంలోనే ఆలోచనతో పని వుంటుంది. కేవలం నా పని నేను పద్ధతిలో చేసుకుంటే ఎలా వుంటుంది అని ఎవరికీ తలవంచకుండా ఈ కారులోనే ఆలోచించ గల్గుతాను కిట్టయ్యా''

సిగ్నల్ పడిపోయింది. ముందుకు నడిపాడు కిట్టయ్య. కొద్దిగా చీకటి పడుతూ వుంది.

''ఏంటో సార్ పూర్తిగా అర్థం కాలేదు''

''నువ్వు కారు ఎప్పటినుండి నడుపుతున్నావు?''

''లైసెన్స్ వచ్చినప్పటినుండి సార్. ఇప్పటికి ముప్ఫయి ఏండ్లు దాటాయి''

''ఇంత అనుభవం వుంది కదాని ఎలా పడితే అలా నడుపుతావా?''

''భలేవారు సార్! ఏ డ్రైవర్‌కైనా ప్రతిరోజూ కొత్త రోజే. అన్ని రూల్సూ చక్కగా పాటించాలి''

''కరెక్ట్! జీవితం అంతే! విధులూ అంతే. ప్రతి రోజూ కొత్తరోజే. సూర్యోదయం అయిందంటే ఇరవై నాలుగు గంటల అద్భుతమైన ప్రాణశక్తి మనకి లభించినట్లే. అవునా?''

''...''

''బాధపడకు కిట్టయ్యా. నీకూ నాకూ ఋణం ఇక అయిపోయినట్లే. ఈ అడ్రస్సు చూడు. అంతే!''

''ఊర్కోండి సార్. మిమ్మల్ని ఎలా మరచి


With Best Compliments From

A.S.R. TRANSPORT

Fleet Owners & Transport Contractors

S&S Plaza, First Floor, Flat No. 103, Sri Krishna Nagar,
Jubilee Hills Road, Hyderabad - 500 045.
Tel: (O) 040 - 23541205 Fax: 23541875
B.O: Vijayawada. Tel: (0866) 2451499
B.O: Coimbattore. Tel: (0422) 2252674
H.O: 37/120, Behind Indira Gandhi Co-op. Hospital,
Kadavanthra, Ernakulam - 682020
Ph: (0484) 2206920, 2206114. Fax: 2205159

स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
Glorious Past-Brighter Future

పోతాం?''

కిట్టయ్య కారు పక్కగా ఆపి ఎవర్నో అడ్రస్సు అడిగాడు. అతను ఏవో సూచనలు చేశాడు. తన చేతిని చేప తిరిగినట్లు అటూ ఇటూ తిప్పాడు. కిట్టయ్య మరలా కారెక్కాడు. కొద్దిగా విసుగ్గా వెనక్కి తిప్పి మళ్లీ వెంటనే ఏదో రద్దీగా వున్న రోడ్డులోకి పోనిచ్చాడు. అసలు ఈయనకి ఈ అడ్రస్సు ఎందుకో? ఎవరో బంధువులో లేక మిత్రుల ఇల్లో అయి వుంటుంది.

''సార్?''

''ఏంటి కిట్టయ్యా?''

''మీరు ఈరోజు అందరిలాగా గుడికి వెళ్లారా?''

''మనం వెళుతున్నది గుడికే!''

కిట్టయ్య ఆ మాట వినగానే ప్రక్కకు తిప్పి కారు ఆపేశాడు.

''చెప్పలేదేంటి సార్?''

''గుడి అంటే నువ్వనుకునేదికాదు. నేను అనుకునేది. అది ఇల్లే. అయినా ఎలాగూ ఆపావు. ఆ పూల షాప్ వాడ్ని అడుగు. చెబుతాడేమో''

ఈసారి ఇద్దరూ కారు దిగారు. కిట్టయ్య ఆ షాప్ వాడ్ని అడిగాడు. వెనక్కు తిరిగి నడుచుకుంటూ వచ్చాడు.

''అతనికి తెలియదన్నాడు సార్''

''అవునా. పద...'' అంటూ ఆయన ఆ షాప్ వరకూ వచ్చి-

''ఆ పూలదండ ఎంత?'' అని అడిగారు.

''ఇరవై అయిదు'' అన్నాడు షాప్ వాడు.

పూలదండ తీసుకున్నారు విజయ్‌కుమార్ గారు. ఆ వెతుకుతున్న అడ్రస్సులో ఎవరికైనా వెయ్యాలేమో అనుకున్నాడు కిట్టయ్య. అలా అనుకునే లోపలే ఆయన ఆ దండని ఆ షాప్ వాడి మెడలో వేసేశారు.

''ఏమనుకోకు...'' అన్నారాయన. ''ఏదైనా అడిగితే తెలియనప్పుడు తెలియదు అని చెప్పావు చూడు, నాకు చాలా నచ్చింది. ఇంకొకరైతే ఏదేదో చెప్పేవారు''

అతను పళ్లు ఇకిలించాడు.

* * *

''సార్''

''ఏంటి కిట్టయ్యా''

''ఇది దొరకదేమో అనిపిస్తోంది. పూర్తిగా చీకటి పడిపోయింది. మన కారు కొన్ని దారులలోంచి వెళ్లలేదు కూడానూ''

కారు పోతోంది.

''కిట్టయ్యా''

''సార్''

''ఆ కాగితాలు ఏరుకుంటున్న పిల్లల్ని చూశావా?''

''రోజూ చూస్తాను సార్''

''ఏ పని లోనైనా విసుగు కలుగుతున్నప్పుడు చేతిలో పనిలేని వాళ్లని, బలహీనులని చూడు. వాళ్లు బడికి వెళ్లాలంటే ఇంకో జన్మ ఎత్తాలి?''

''మనం వెళ్లవలసిన చోట ఏం దొరుకుతుంది సార్?''

''కొలంబస్ గురించి విన్నావా కిట్టయ్యా?''

''కాగితాలు ఏరేవాడా సార్?''

''నో. అతని సహచరులతో కలిసి అమెరికాను కనుగొన్నాడు. అక్కడ నిధులుంటాయి అని వాళ్లు అనుకున్నారట. అమెరికా చేరుకుని సంబరం చేశారు. కొలంబస్ వేడుక చేసుకుంది అమెరికా దొరికినందుకు కాదు. ఏదైనా సాధించటానికి తను కనుక్కున్న మార్గం నిజమైనదని రూఢి అయినందుకు''

కారును పక్కగా ఆపాడు కిట్టయ్య.

''సార్, ఇక్కడ నుండీ కొద్దిగా అడుగుతూ వెళదాం''

''రైట్. పద. నీ ప్రయత్నంలో గమ్యంతో పాటు నీవు చేపట్టిన మార్గం కూడా దొరుకుతుంది.

ఇద్దరూ చాలా సందుల్లో తిరిగారు. కిట్టయ్య కాగితం పట్టుకుని వీధి చివరకు వెళ్లి, విజయకుమార్ గారు జేబుల్లో చేతులు పెట్టుకుని వీధి మొదల్లో దాదాపు గంటసేపు వెతికేశారు. విజయ్‌కుమార్ గారు చివరికి అక్కడ ఒక టైలర్ దగ్గర కూర్చున్నారు. కిట్టయ్య ఒక పరుగున వచ్చాడు.

''సార్, దొరికింది. ఆ ప్రక్క సందులో వుంది''

గబగబా ఇద్దరూ అక్కడికి వెళ్లి నిలబడ్డారు. ఎన్నో అంతస్తులు వున్న ఇల్లు అది.

''అడ్రస్సు ఇదే...'' అన్నారాయన. ''కానీ నేను వెళ్లవలసిన చోటు ఇది కాదు''

''సార్'' కిట్టయ్య తలపట్టుకున్నాడు.

''భయపడకు. నాకు కావలసింది ఆ ఎదురిల్లు''

ఆయన జాగ్రత్తగా ఆ ఎదురింటి గేటు తీసి లోపలికి నడిచాడు. కిట్టయ్య వెనుకే నడిచాడు. అక్కడ కొందరు మహిళలు చీరెలకు ఫాబ్రిక్ పెయింటింగ్ చేస్తున్నారు. ఆయన బెల్ నొక్కారు. ఒక అమ్మాయి బయటకు వచ్చింది.

''ఎవరు కావాలి?'' సింపుల్‌గా అడిగింది.

''ఏం లేదు. మీరందరూ ఈ ఇంట్లో ఎప్పటి నుంచి వుంటున్నారు?''

ఆ ప్రశ్నకి ఆ అమ్మాయి ఎందుకో లోపలికి వెళ్లిపోయి కొద్దిగా భారీగా వున్న మరో అమ్మాయిని పంపించింది. ఈమె లోకం చూసినట్లు వుంది.


''మీరెవరు?'' కరెక్ట్ ప్రశ్న విసిరింది. కిట్టయ్య గేటుకు దగ్గరగా జరిగాడు.

''సారీ. ఏమీ అనుకోవద్దు'' విజయ్‌కుమార్‌గారు బరువైన గొంతుతో అంటున్నారు. ''నలభై రెండు సంవత్సరాల క్రితం మేము ఆ ఎదురింట్లో అద్దెకు వున్నాము. ఈరోజు వరకూ ఎవరికీ చెప్పని విషయం చెప్పాలి..''

ఆ అమ్మాయి ముఖ కవళికలు మారిపోయాయి.

''మేము ఎవరికీ అప్పులేము. సారీ''

''ఛా. అదేమీ కాదు. మీ సమయం ఎక్కువ తీసుకోను. కేవలం అది చెప్పేసి గుండె బరువు తేల్చేసుకుని వెళ్లిపోతాను. వద్దు.. కుర్చీ ఏమీ వద్దు. నేను ఒక చాలా పెద్ద కంపెనీలోచాలా పెద్ద హోదాలోంచి ఈ రోజే రిటైర్ అయ్యాను. చిన్నప్పుడు ఇంటర్‌మీడియట్‌లో రావలసిన మార్కులు రానం



దుకు నాకు ప్రపంచమంతా చీకటైపోయింది. బ్రతకటం ఇష్టంలేక అదిగో, ఆ ఎదురింటి లోని డాబా మీదకి వెళ్లిపోయి దూకెయ్య బోయాను...''

కిట్టయ్య దగ్గరికి వచ్చి చేతులు కట్టుకున్నాడు. ఆ అమ్మాయి వెనుక మరో అమ్మాయి వచ్చి నిలబడింది.

''ఆ సమయానికి నేను ఏమి ఆలోచించానో నాకే తెలియదు. కిందకి చూశాను. ఈ ఇంట్లో అప్పుడు మీరెవరూ లేరు. ఒకచిన్న కుటుంబం వుండేది. మూడేళ్ల లోపు పిల్లవాడు ఒకడు అప్పుడే బయటకు వచ్చి వాళ్ల నాన్న స్కూటర్ తీస్తుంటే వాడినీ బండిమీద తీసుకుని వెళ్లమని తెగ మారాం చేస్తున్నాడు. ఆయన ఎలాగో అలాగ అతన్ని వాళ్ల అయ్యకి ఇచ్చి స్కూటర్ స్టార్ట్ చేసి వెళ్లిపోయాడు. వాళ్ల నాన్న వెళ్లిపోగానే పిల్లవాడు అయ్య చంక దిగిపోయి లోపలి నుంచి తన చిన్న ట్రై సైకిల్ తెచ్చుకుని కసి తీరా ఆ గేటు ముందు తొక్కుకున్నాడు. అదంతా గమనించి నేనెందుకో ఆగిపోయాను...

ఎవరికైనా చేతిలో ఏదో ఒకటి వుంటుంది. ఆ పనిలో లీనమైపోవాలి. నేను పోగొట్టుకున్నదేమీ లేదని ధైర్యంగా కిందకి దిగిపోయాను.

సారీ. ఆ పిల్లవాడు ఇప్పుడు ఎక్కడ, ఏం చేస్తున్నాడు అని నేను అడిగితే మీకు నవ్వొస్తుంది. వాళ్లు ఇక్కడ ఉన్నారో లేదో కూడా తెలియదు''

అంతలోనే తలుపు ప్రక్కనుంచి వీల్‌చెయిర్‌లో ఒక వృద్ధురాలు ముందుకు వచ్చింది. ఆయన్ని చిరునవ్వుతో చూసింది.

''వాడు మావాడేనండీ. ఎప్పుడూ నూరో మెట్టు ఎక్కాలనే చూస్తాడు. అదుగో ఎయిర్‌ఫోర్స్‌లోకి వెళ్లి ఎయిర్‌క్రాఫ్ట్‌లు నడుపుతున్నాడు... లోపలికి రండి''

''మీరిలా...''

''నన్ను వాడిదగ్గరికి రమ్మన్నా నేను వెళ్లను. కరెక్ట్. చేతిలో పనున్నంత కాలం ఎవరూ చావరు! సరదాగా పదిమందికి ఈ పెయింటింగ్ నేర్పుతున్నాను''

విజయ్‌కుమార్ గారు జేబులోంకి ఒక గోల్డ్ కాయిన్ తీశారు.

'' ఆ కుటుంబం దొరుకుతుందో దొరకదో అనుకున్నాను. నేను అదృష్టవంతుడ్ని. మా కంపెనీ వాళ్లు ఇచ్చిన కాయిన్ ఇది. దీని మీద నా పేరు, లోగో వుంటాయి. ప్లీజ్... దీనిని మీ అబ్బాయికి నా కానుకగా ఇవ్వండి''

ఆవిడ దానిని తీసుకుని కళ్లు చిట్లించి చూసింది. అబ్బాయికి ఎన్నో మెడల్స్ వచ్చి వుంటాయి. ఇది వింతగా వుంది.

* * *

మెయిన్ రోడ్డుమీద కారును ప్రక్కగా ఆపించారు విజయ్‌కుమార్‌గారు. ''కిట్టయ్యా, వెళ్తాను. బరువు తీరిపోయి గాలిలో తేలుతున్నాను. ఇక్కడినుండి ఇంటిదాకా నడుచుకుంటూ వెళతాను...'' అంటూనే కారు దిగిపోయారు. రెండు చేతులూ జేబుల్లో పెట్టుకుని పేవ్‌మెంట్ మీదకి వెళ్లారు.

''సార్''

''ఏంటి కిట్టయ్యా?''

''గుడికి వెళ్లరా?''

''నేను నిరంతరం గుడిలోనే వుంటాను కిట్టయ్యా. నా పనిలోనే వుంటాను. కాకపోతే దారిలో ఏ గుడిలోనో దేవుడు ఎదురయితే నమస్కారం చేసుకుంటాను''

వెనక్కి తిరగకుండా ఆయన అలా పేవ్‌మెంట్ మీద నడుచుకుంటూ వెళ్లిపోయారు.

చీకటిగా వుండటంతో కిట్టయ్య కారు లైట్లు ఆయనకు కనపడేటట్లు వేసి వుంచాడు.

''కర్మయే ఫలం...'' ఆయన మాటలు గుర్తుకొచ్చాయి. ''మరో ఫలం ఏదీ వుండదు. నీకు చేతైన పనిలోనూ, చేతిలో వున్న పనిలోనూ మునిగి తేలిపోతూ వుండు! ఏ బాధా నీ దగ్గరికి రాదు. నీ పనే నీ ప్రపంచం. అందులోనే పాడుకో, ఆడుకో. అదే ఆనందం. నీ ప్రపంచంలో నువ్వున్నంత కాలం నువ్వు దేనినీ వెతుక్కునే అవసరం లేదు. ప్రపంచం నిన్ను వెతుక్కుంటుంది''


తెలుగు పత్రికా ప్రపంచంలో వెలుగు రేఖలు విరజిమ్ముతూ నాలుగు వసంతాలు పూర్తి చేసుకుని ఐదవ వసంతంలోకి అడుగిడిన సందర్భంగా ఆంధ్రజ్యోతికి శుభాకాంక్షలు తెలియజేస్తూ....

Space donated by

Well Wisher